



తోటలో మల్లెపందిరి దగ్గర తిన్నెమీద కూర్చుంది, పద్మావతమ్మ – ప్రక్కనే ప్రొద్దుతిరుగుడు పూలు విరగబూసివున్నాయి. ఇంకోవైపు అంటుమామిడిచెట్లు జంటగా ఉన్నాయి. వాటినీడ పద్మావతమ్మ ముఖంమీద పడుతోంది. పొద్దుతిరుగుడుపూలు వచ్చగా విరిసి సూర్యునివేపు వంపు తిరిగి ఉన్నాయి. ఆమె వాటికేసి చూస్తోంది – దీక్షగా! ఆ పూలబ్రతుకు ఆమెకు వింతగా తోచింది. ఆధారంలేకుండా విలవలేని పూలు; సూర్యుడు ఉదయిస్తే కన్ను తెరుస్తాయి. ఆతను ఏవేపు తిరుగుతే ఆలేపే తిరుగుతాయి. అతను కను చాటయితే అవీ బ్రతకలేక కన్ను మూస్తాయి. ఎంత విచిత్రం! ఆధారం

లేకుండా బ్రతకలేని ఆడదాని బ్రతుక్కు ప్రతీక ఆ పూలు! తనూ అంతేకదా! ఏదో వెలుగు ఎదటకనిపించినన్నాళ్ళు వికాసము పొందింది. ఆ వెలుగు అస్తమించగానే దిక్కుతోచక చీకట్లో మనస్సు అల్లాడుతోంది! దీపంలేకుండా నీడ ఉండలేదు. ఇప్పుడు దీపం ఆరిపోయింది. అయినా ఇంకా నీడమాత్రం మిగిలివుంది. ఇదేదో విచిత్రమైన పరిస్థితి!

దూరాన మేడ కనిపిస్తోంది. చెట్ల సందుల్లోంచి తెల్లనిగోడలు అందంగా ఉన్నాయి. అది తనఇల్లు. ఎంతో ఓపికతో అందంగా కట్టించుకున్న ఇల్లు; ఉండేది తనూ, భర్త రామారావు ఇద్దరు మాత్రమే! అయినా విశాలంగా అందంగా కట్టించుకున్నారు. ఎక్కడెక్కడినుంచో, రకరకాల వస్తువులు తెచ్చి గదులన్నీ అలంకరించారు. అయినా ఇల్లంతా ఎప్పుడూ వాడలేదు. మేడమీద దక్షిణంవైపు మూడు గదులు మాత్రమే వాడుకునేవారు. క్రింద వంట ఇల్లు భోజనాలగది, వసారా అన్నీ వంటామె చంద్రమ్మ ఆధీనంలో ఉంటాయి. మిగిలినఇల్లు దుమ్ము దులపడానికీ ఎవరైనావస్తే చూపించటానికీ మాత్రం ఎప్పుడైనా తలుపు తెరిచేవారు.

రామారావు సబ్బుల వ్యాపారం చేశాడు. అది అతనికి కలిసివచ్చింది, క్రమంగా ఆస్తి, అంతస్తూ పెరిగాయి. సుఖంగా కాలం గడపడానికి అలవాటు పడ్డాడు తెల్లనిబట్టలు, పువ్వులు, సుగంధ వస్తువులు, నాజూకుబ్రతుకు నేర్చుకున్నాడు పద్మావతమ్మ అన్ని విధాల అతనికి నీడలాఉండేది. అతని పనులన్నీ తానే చేసేది. ఏ క్షణమైనా కాస్త దూరమైతే ఎదురుచూస్తూ ఉండేది. ఆమెకు మరొక బ్రతుకు, మరొక ఆలోచన లేవు.

అతను ఉన్నట్టుండి "రేపుమనం సిమ్లా వెళదాం!" అంటే వెంటనే బట్టలు సర్దుకునేది. "మనం పైనెల జపాను వెడుతున్నాము" అంటే విని ఊరుకునేది, "అమ్మో! అంతదూరమా!" అని మనసులో అనుకునేది. "ఈ ప్రయాణమెందుకూ?" అని ఎప్పుడూ అడగలేదు. అతను వెళితే తానూ వెళ్ళాలి అంతే! అతనికి ఉదయమే వేన్నీళ్ళుకాచి ఇవ్వాలి. పదిగంటలకు హార్లిక్సుకలిపి ఇవ్వాలి. అతని వస్తువులన్నీ చూసి సర్దాలి. అతను అన్ని సంగతులు తనతో చెపుతాడు. తాను ఓపికగావినాలి. అంతమాత్రమే తెలుసు, వ్యాపార విషయాలన్నీ ఎంత చెప్పినా ఆమెకు అర్థంకావు. అతను అందమైన వస్తువులను సుందరమైన దృశ్యాలను వర్ణించి చెపితే అర్థమవుతుంది; ఇంకేమీ అర్థంకావు, అయినా ఓపిగ్గా వింటూనే ఉంటుంది. ఒక్కొక్కసారి మనసు నిలవదు. దృష్టిబయట విరగబూసిన సన్నజాజి తీగమీదకు పోతుంది. ఆ




పువ్వులు గుప్పెడుకోసి తెచ్చుకోవా లనిపిస్తుంది. అయితే ఆమె పరధ్యానంగా ఉంటె అతనికి కోపంవస్తుంది. అందుకే కదలలేదు.

ఒకసారి ఈ మల్లెపందిరి దగ్గరే ఒంటరిగా కూర్చున్నారు. పండువెన్నెల కాస్తోంది. ఆక్షణం అతను ఎంతో సంతోషంగా ఉన్నాడు. పరిహాసంగా అన్నాడు. "ఇవ్వాళ మన వ్యాపారం పడిపోయినా ఫరవాలేదు. మనకున్న ఆస్తి మూడు తరాలకు సరిపోతుంది." అని. ఆమాటలకు ఆమె తెల్లబోయింది. "మూడుతరాలా! ఇప్పుడు ఎవరున్నారు మనకు? పిల్లలు లేరుగదా!" అనుకుంది. మాట్లాడలేదు. అతను సంతోషంగా ఉన్నాడు. "ఇంత పాధించాను గదా! ఇంత సంపాదించానుకదా!" అని తృప్తికాబోలు, అతని మనసు నొప్పించకూడదు. అందుకే ఊరుకుంది.

మూడేళ్ళ క్రిందట అతనికి జబ్బు చేసింది, దగ్గు ఆయాసంతో కొన్నాళ్ళు బాధపడ్డాడు. మళ్ళా కోలుకున్నాడు. నిరుడు మళ్ళా జబ్బుచేసింది. ఆరు నెలలు జబ్బుగానే ఉన్నాడు. తను ఇల్లు పూర్తిగా చంద్రమ్మకే వదిలేసింది. రాత్రింబగళ్ళు అతని దగ్గరేఉంది; ఆరు నెలలు ఆమెకు ఆకలి వేయటంలేదు. నిద్రా రాలేదు. శరీరం నీరసించి తపనపడింది. అతనికి జబ్బు నయం కాలేదు. రోజు రోజుకూ బాధ ఎక్కువైంది. అతని ఆవేదన చూడలేక ఏమీ చెయ్యలేక ఆమె అల్లాడిపోయింది. ఒక్కక్షణం ప్రాణమైనా

పోతె బాగుండుననిపించింది. ఆ ఊహ కామె అదరిపడింది. ఏమూలో తనలో రాక్షసత్వం ఉన్నదా! — అనుకుంది. కుమిలిపోయింది. ఏదో మైకంలా వచ్చి ఒక్క-క్షణం ఒళ్ళు తూలింది; తేరుకుని అతనివేపు చూచింది. అతను ప్రశాంతంగా ఉన్నాడు. అతని ముఖంలో ఇప్పుడు ఏ ఆవేదనాలేదు; ఆమె అతను విశ్రమిస్తున్నాడనుకుంది. కదిలితే మెళకువ వస్తుందేమో! మళ్ళా బాధ పడతాడేమో! అలాగే భయంగా ఒరిగి కూర్చుంది, ఒక్క-క్షణం! అతను అన్ని బాధలకు అతీతంగా వెళ్ళిపోయాడన్న సంగతి తెలియలేదు. — డాక్టరువచ్చి చెప్పిందాకా!

ఆకాశంలో ఆడుతున్న గాలిపటం, నేలమీద లాగుతున్న దారం తెంపుకు వెళ్ళిపోయింది, ఏ మూలకో! ఈ మేడల నందున ఎక్కడని దాన్ని వెతకటం! పద్మావతమ్మ బ్రతుకు తెగిన దారంలా రెపరెపలాడింది. అతను ఉండగా ఆమెకు ఏచింతాలేదు, అతను ఎప్పుడూ ఆమె కొంగుపట్టుకు వదలలేదని కాదు. ఒక్కొక్కరోజు పొద్దున వెళితే మళ్ళా రాత్రికే కనిపించేవాడు. అయినా అప్పుడు బాధలేదు, ఒంటరితనంలేదు, ఇప్పుడు ఇల్లంతా బోసిగాఉంది. బ్రతుకు భయంకరంగా ఉంది. చంద్రమ్మ పని గట్టుకు పైకివచ్చి కూర్చునేది, — తనకు తోడు. కాని అది ఆమెకు నచ్చలేదు, మరొక మనిషిఉంటె మరీ ఏదో ముళ్ళు గుచ్చుతున్నట్లు ఉండేది. ఒంటరిగా వసారాలో పూలచెట్లను చూస్తూ కూర్చునేది, ఆ క్షణం అతను ప్రక్కనే ఉన్నట్లు భ్రమకలిగేది. అదికా స్తఊరట!

కొన్నాళ్ళకి ఇతర విషయాలు మనసులో ప్రవేశించాయి! నీడలు కమ్ముకున్నాయి. మేనేజరు మంచివాడేనా? ఏమో! మోసంచేస్తాడా? భయం పట్టుకుంది, మనశ్శాంతి పోయింది.

ఇంకొన్నాళ్ళకి ఎందరో వస్తామని వ్రాశారు. "అమ్మాయిని నిర్మలను మీఊరు పంపిస్తాను, చదువుకోటానికి, నీకు తోడుగాఉంటుంది. "అని వ్రాసింది అక్క. "నాకు మీఊరు బదిలీ అయింది. మీ ఇంట్లో ఉండాలని ఉంది, సరళను పిల్లల్ని తీసుకువస్తాను." అని రాశాడు మేనల్లుడు.

పద్మావతమ్మకు ఏమీ తోచలేదు. అతను బంధువుల నెవరిని దగ్గర చేర్చలేదు. అతనికి ఒంటరి జీవితమే ఇష్టం. పద్మావతమ్మ తప్ప ఇంకెవరూ కావాలని అతనెప్పుడూ కోరుకోలేదు. మరి ఇప్పుడు తను ఏం చెయ్యాలి? ఆలోచన తెగలేదు. తనకు పిల్లలుంటే బాగుండేదేమో! అప్పుడు బ్రతకటానికి ఒక ఆధారమూ, కారణమూ ఉండేవి! కాని అతను ఎన్నడూ ఆ విషయమే పట్టించుకోలేదు. ఆలోచనలతో ఆమెతల వేడెక్కింది. ఏదోబాధ! భరించలేక

వెళ్ళి రెండు నిద్రమాత్రలు మ్రింగింది. అవి ఎప్పుడో అతనికోసం తెచ్చినవి మర్నాడు మధ్యాహ్నంవరకు నిద్ర పోయింది. మెళకువరాలేదు.

తరువాత మనస్సు తేలికపడింది. ఎప్పుడో అతను అన్నమాట జ్ఞాపకం వచ్చింది. "ఇక సంపాదించక పోయినా ఫరవాలేదు. మనఆస్తి మూడు తరాలకు సరిపోతుంది '' ఈ తరంలో అనుభ వించటానికే ఎవరూ లేరు. మూడు తరాలవరకు ఎందుకూ? దేనిమీదా తనకు ఆసక్తిలేదు. ఉన్నవాళ్లు అనుభవిస్తే ఏం? అనిపించింది. మనసులో బాధపోయింది.

మేనేజరు ఎన్నాళ్ళగానో ఉన్నాడు. పిల్లలుగలవాడు. కష్టపడిపనిచేస్తున్నాడు. తన డబ్బు కొంత వాడుకొంటాడేమో నన్న భయమెందుకూ? పోనీలే - అని పించింది. బంధువులకు, స్నేహితులకు, తన్ను ఆశ్రయించుకున్నవాళ్లకు కాతపోతే ఈ డబ్బు తన కెందుకూ? భద్రంగా ఎన్నాళ్లు దాచుకుంటుంది? ఎంతకాలంబ్రతు కుతుంది? ఎప్పుడూ ఇలానే ఉంటుందా? అనుకుంది విరక్తితో.

ఆ తరువాత అందరూ వచ్చారు. అక్కకూతురు నిర్మల వచ్చింది; మే నల్లుడు సంసారంతో వచ్చాడు. చంద్రమ్మ కూతురికి జబ్బుచేసింది. కూతుర్ని, పిల్ల లను తీసుకువచ్చింది.

ఇప్పుడు ఇల్లు సందడిగా ఉంది. పిల్లల అరపులు, ఆటలు, పెద్దవాళ్ళ మాటలు కలకలలాడుతోంది. అందరూ అన్ని గదులు స్వేచ్ఛగా వాడుకుంటు న్నారు. మేడమీద రెండుగదుల్లో మాత్రం పద్మావతమ్మ తలదాచుకుంది. అందరూ అన్నీ ఆమెను అడుగుతారు. అందరికీ ఆమెడబ్బు కావాలి. ఆమె సలహా కావాలి. అయినా వాళ్ళ సమస్య లేవీ ఆవిడ నెప్పుడూ బలంగా అంట టం లేదు. అందరినీ చూస్తోంది. అంద రితో మాట్లాడుతోంది. ఎవరికి ఏ లోపమూ చెయ్యటం లేదు. అయినా ఏదీ మనసును అంటటం లేదు. తామరాకు మీద క్షణం నిలిచి జారిపోయిన నీటి బొట్టులా ప్రతిసంగతి ఒక్కక్షణం మన సునుతాకి మళ్ళా జారిపోతోంది.

ఒడ్డుకు చేరిన నావలా ఉంది, ఇప్పుడు ఆమె బ్రతుకు। కల్లోలం లేదు, ఏ క్షణాన అలలు ఉవ్వెత్తుగా లేస్తాయో, ఏ క్షణాన తుపానుముంచుకు వస్తుందో అన్న భయంలేదు. తీరాన ఉంది అలల తాకిడికి కదలిపోతూన్న తెప్పలను వింతగా చూడడం వినోదంగా ఉంది.

సూర్యుడు అస్తమించాడు. ప్రొద్దు తిరుగుడుపూలు వాడిపోయినాయి. పద్మా వతమ్మ లేచి ఇంటికి వెళ్ళింది. చంద్రమ్మ, పిల్లలు తులసికోట దగ్గర కూర్చుని పాటలు పాడుతున్నారు. మేడమీద మేనల్లుడు భార్యనేదో పరిహాస మాడి ఉడికిస్తున్నాడు. ప్రక్కనే నిర్మల విరగబడి నవ్వుతోంది.

అప్రయత్నంగా పద్మావతమ్మ మెల్లగా నవ్వింది.